పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక : 61 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | మంగళవారం 3 నవంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :61 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : KAKINADA | TUE 3 NOVEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

ప్రతి మండలంలో కూటమి జెండాలు

రెపరెపలాడాలి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం



- రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ స్థానాలనూ కైవసం చేసుకోవాలని లక్ష్య నిర్దేశం
- కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- పట్టణ స్థానిక ఎన్నికల కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం
- తుఫాన్ల సమయంలోనూ ఎన్నికలు, పాలనపై ఏకకాలంలో దృష్టి సారించామన్న సీఎం

రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని, ఆ దిశగా ఎంపీటీసీ స్థానాల్లో పైచేయి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీల ముఖ్యనేతలతో ఆయన సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలనూ కూటమి పార్టీలే కైవసం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.

- మిగతా 2లో



- ఏపీలోని 13 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్
- నేడు (మంగళవారం) ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 138 కేంద్రాల్లో కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- టీడీపీ కూటమి, వైసీపీకి అత్యంత కీలకంగా మారిన పుర ఎన్నికల ఫలితాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉత్కంఠ రేపిన పట్టణ స్థానిక సంస్థల (ఖూదీ) ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. నవంబర్ 1న జరిగిన ప్రధాన పోలింగ్‌లో వివాదాలు తలెత్తిన 13 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పుడు ఓట్ల లెక్కింపుపై పూర్తి దృష్టి సారించింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

రీపోలింగ్ ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు ఫలితాలపై నిలిచింది. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 నగరపాలక సంస్థల కోసం 22, మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కోసం 116 కలిపి మొత్తం 138 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 556 కౌంటింగ్ హాళ్లు, 6,831 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులతో పాటు భారీగా సిబ్బందిని నియమించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్ కేంద్రాల

- మిగతా 2లో

5 జిల్లాల్లో ప్రశాంతంగా రీపోలింగ్

నవంబర్ 1న పోలింగ్ సందర్భంగా బూత్ కబ్జా, రిగ్గింగ్ వంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ 13 కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఆదేశించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం, అనంతపురం, తిరుపతి, వైఎస్సార్ కడప, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఉన్న 12 వార్డులలో ఈ రీపోలింగ్ జరిగింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించడంతో పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, పల్నాడు జిల్లాలోని మాచర్ల వంటి కీలక ప్రాంతాల్లో రీపోలింగ్ జరగడం గమనార్హం.



వైసీపీలో తీవ్ర మనోవేదన అనుభవించా..

11న పార్టీని ప్రకటిస్తా

- ఏపీలో తమ పార్టీ మూడో ప్రత్యామ్నాయ పార్టీ అవుతుందన్న విజయసాయిరెడ్డి
- 11వ తేదీన పార్టీ ప్రకటనలో ఎవరినీ కించపరచాలనే ఉద్దేశం లేదని వ్యాఖ్య
- అన్ని వర్గాలకు అధికారం కట్టబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ


- మిగతా 2లో



ఎన్నికల సంఘం అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణం

- పులివెందులలో 70 బూత్‌లలో ఏజెంట్లను తరిమేశారని ఆరోపణ
- 4 బూత్‌లలో రీపోలింగ్ పెట్టడం కంటితుడుపు చర్య అని విమర్శ
- ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం

- మిగతా 2లో



ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది..

తక్షణమే సాయం అందించండి

- అర్నబ్ తుపాను నష్టం అంచనా వేసేందుకు ఏపీలో పర్యటిస్తున్న కేంద్రబృందం
- కేంద్రబృందంతో సమావేశమైన సీఎం చంద్రబాబు
- అర్నబ్ తుపాను వల్ల ప్రాథమికంగా రూ.4,526 కోట్ల నష్టం వాటిల్లినట్టు చంద్రబాబు వెల్లడి
- రాష్ట్రానికి త్వరితగతిన సాయం అందించాలని కేంద్ర బృందానికి సీఎం విజ్ఞప్తి
- ఒకవైపు కరవు, మరోవైపు తుపానులతో ఏపీ ఇబ్బందులు పడుతోందని వెల్లడి

- మిగతా 2లో



హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు..

ఫేజ్-2కు రూ.150 కోట్లు

- మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్లు మంజూరు
- రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయింపు
- పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఫేజ్-2 అధ్యయనాలు, సర్వేలకు నిధుల వినియోగం
- శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం ప్రతిపాదన
- ఎయిర్‌పోర్టు నుంచి పాతబస్తీ వరకు.. మెట్రో రెండో దశకు ఊతం

- మిగతా 2లో



గ్రోక్ ఏఐతో ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ

- గ్రోక్ ఏఐ ఆదాయం, ఖర్చులపై ఎలాన్ మస్క్ వ్యాఖ్యలు
- సర్వర్ ఖర్చుల నియంత్రణకే వినియోగంపై పరిమితులని వెల్లడి
- ఏఐ కారణంగా భారీగా పెరుగుతున్న టెక్ కంపెనీల అప్పులు

- మిగతా 2లో

అమెరికాలో భారతీయులు నిరసన చేస్తే

ఊరుకుంటారా?

ఇమ్రాన్ ఖాన్‌కు కోర్టు మందలింపు

పెన్ పవర్ డెస్క్: ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్ మేనల్లుడు, ఎన్నికల సంఘానికి (ఈసీ) వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్న నటుడు ఇమ్రాన్ ఖాన్ పై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

- మిగతా 2లో





మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే..

ఏం చేస్తానంటే..?

పెన్ పవర్ డెస్క్: ఇరాన్‌తో అమెరికా యుద్ధం, ప్రపంచ దేశాలతో సంఘర్షణల నేపథ్యంలో యూఎస్‌లో అధికశాతం ప్రజలు అధ్యక్షుడు ట్రంప్ ను వ్యతిరేకిస్తున్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే.. తాను

- మిగతా 2లో



బిల్‌బోర్డ్స్ హ్యాక్.. నీలి చిత్రాల ప్రదర్శన..

పెన్ పవర్ డెస్క్: బహిరంగ ప్రదేశాల్లో ప్రకటనలను ప్రదర్శించే బిల్‌బోర్డ్‌లపై ఒక్కసారిగా నీలి చిత్రాలు దర్శనమిచ్చాయి..! దీంతో రోడ్డుపై వెళ్తున్న ప్రజలంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ పరిణామంతో యాడ్ ఏజెన్సీ సంస్థలు కంగుతిన్నాయి. ఐదు దేశాల్లో ఇదే పరిస్థితి కనిపించడం సంచలనంగా మారింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

- మిగతా 2లో

పెన్ పవర్

మంగళవారం 3 నవంబర్ 2026



అమెరికా ఎన్నికలతో భారత్‌కు కొత్త పరీక్ష.. ట్రంప్ ఓడితే భారత్ కు లాభమా? నష్టమా?

ప్రపంచ రాజకీయాల్లో జరిగే ప్రతి చిన్న చలనం అంతర్జాతీయంగా పెద్ద అలలనే సృష్టిస్తుంది. ముఖ్యంగా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్.. అత్యంత శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశమైన అమెరికా మధ్య ఉన్న వ్యూహాత్మక సంబంధాలు ఎంతో విదదీయరానివి. ప్రస్తుతం అమెరికాలో చోటుచేసు కుంటున్న రాజకీయ పరిణామాలు.. అక్కడ జరగబోయే ఎన్నికలు కేవలం ఆ దేశానికే పరిమితం కాకుండా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, దౌత్య వ్యూహాలు, లక్షలాది మంది నిపుణుల భవిష్యత్తును ప్రభావితం చేసే అత్యంత కీలక ఘట్టంగా మారాయి.డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ల నిర్ణయాలు.. ఒకవేళ డెమోక్రాట్ల ఆధిపత్యం పెరిగితే వచ్చే మార్పులు.. ఇలా ప్రతి పరిణామం భారత్‌పై సానుకూల.. సవాలుతో కూడిన ద్వంద్వ ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఈ ఎన్నికల తుది ఫలితాలు ఏ విధంగా ఉన్నా భారతదేశం తనదైన దౌత్య పటిమతో ఈ మార్పులను అధిగమిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.భారతీయ ఐటీ రంగానికి అమెరికా ఒక ప్రధాన వేదిక. గత కొంతకాలంగా హెచ్-1బీ వీసా విధానాలపై వస్తున్న ఆంక్షలు.. నిబంధనలు మన టెక్ నిపుణులను ఆందోళనకు గురిచేసిన మాట వాస్తవమే. అయితే అమెరికా కాంగ్రెస్‌లో రాజకీయ సమీకరణాలు మారితే వీసా విధానాల్లో కొంత నిలకడ, సానుకూల పారదర్శకత వచ్చే అవకాశం ఉంది. విదేశీ ప్రతిభకు గుర్తింపు లభిస్తే మన టెక్ దిగ్గజాలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి సంస్థలకు నూతన ఉత్తేజం లభించడమే కాకుండా వేలాది మంది భారతీయ యువ నిపుణులకు అమెరికాలో సరికొత్త అవకాశాల ద్వారాలు తెరుచుకుంటాయి.అమెరికా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. భారతీయ ఔషధాలు, వస్త్రాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులకు అక్కడ మంచి డిమాండ్ ఉంది. అమెరికా అంతర్గత రాజకీయాల్లో వాణిజ్య విధానాలపై పునరాలోచన జరిగితే భారత ఎగుమతులపై విధించే సుంకాల భారం తగ్గి మన ఎగుమతిదారులకు ఊరట లభించవచ్చు. పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికన కుదిరే వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయి.ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న వ్యక్తిగత సంబంధాలు ద్వైపాక్షిక చర్చల్లో ప్రాధాన్యం సంతరించు కున్నాయి. అయితే అమెరికాలో డెమోక్రాట్లు అధికారంలో ఎక్కువ ప్రభావం సంపాదిస్తే మానవ హక్కులు, వాణిజ్య పారదర్శకత, పర్యావరణ విధానాలు వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో రక్షణ, సాంకేతిక రంగాల్లో భారత్‌తో సహకారం కొనసాగించాల్సిన వ్యూహాత్మక అవసరం అమెరికాకు కూడా ఉంది.అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నది మాత్రమే భారత్‌కు ముఖ్యం కాదు. గెలిచిన పార్టీ ఎలాంటి విధానాలను ముందుకు తీసుకెళ్తుందన్నదే అసలు ప్రశ్న. రిపబ్లికన్లు తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటే ట్రంప్ విధానాలకు మరింత రాజకీయ బలం లభించవచ్చు. డెమోక్రాట్లు ప్రతినిధుల సభను కైవసం చేసుకుంటే ట్రంప్ నిర్ణయాలపై నియంత్రణ, పర్యవేక్షణ పెరగవచ్చు.అధికారంలో ఎవరున్నా నాయకులు మారినా భారత్-అమెరికా మధ్య ఉన్న రక్షణ, ఇండో-పసిఫిక్ వ్యూహం, సాంకేతిక సహకారం , ఇంధన రంగాల బంధం బలమైన పునాదులపై నిర్మితమైంది. చైనా సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో భారత్ అమెరికాకు ఒక విదదీయరాని వ్యూహాత్మక భాగస్వామి. ఈ నేపథ్యంలో దౌత్యపరమైన అంశాల్లో సవాళ్లు ఎదురైనా భారతదేశం తన స్వావలంబన శక్తితో.. స్పష్టమైన విదేశాంగ విధానంతో ముందుకు సాగుతోంది.అమెరికా మధ్యంతర ఎన్నికలు భారతీయులకు ఒకేసారి ఆశలు, ఆందోళనలు కలిగిస్తున్నాయి. హెచ్-1బీ వీసాదారులకు కొంత ఊరట దక్కుతుందా? భారత ఎగుమతులపై సుంకాల భారం తగ్గుతుందా? భారత్-అమెరికా మెగా వాణిజ్య ఒప్పందం ముందుకు సాగుతుందా? అన్న ప్రశ్నలకు ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఈ ఎన్నికలు భారత్‌కు కేవలం ఒక పరీక్ష మాత్రమే కాదు.. కొత్త అవకాశాలను పసిగట్టి అంతర్జాతీయ వేదికపై మన బలాన్ని మరింతగా నిరూపించుకునే గొప్ప సందర్భంగా చెప్పొచ్చు.

ముగిసిన లీపోలింగ్.. ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- మొదటి పేజీ తరువాయి

వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీటీవీ కెమెరాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న ఏజెంట్లను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు.

కూటమి, వైసీపీకి ప్రతిష్ఠాత్మకం

రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న స్థానిక ఎన్నికలు కావడంతో ఈ పుర ఫలితాలు అధికార, విపక్షాలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. 92 పట్టణ స్థానిక సంస్థలకు జరిగిన ఈ ఎన్నికల్లో నవంబర్ 1న సుమారు 60.96% పోలింగ్ నమోదైంది. 13 మేయర్, 70 మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులతో పాటు, కార్పొరేషన్లలో 804 డివిజన్లు, మున్సిపాలిటీలలో 2,382 వార్డుల భవిష్యత్తు రేపటి కౌంటింగ్‌తో తేలనుంది. ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే.. ఏం చేస్తానంటే..?

- మొదటి పేజీ తరువాయి

'మిస్టర్ వీటో'గా మారాల్సి రావచ్చని పేర్కొన్నారు. వారి అధికారాలను నియంత్రించేందుకు వీటో పవర్‌ను వినియోగిస్తానన్నారు."ఎన్నికల్లో వారు గెలిచి, కాంగ్రెస్‌పై పట్టు సాధిస్తే.. వారు చేసే బిల్లులను ఆమోదించకుండా అన్నింటినీ తిరస్కరిస్తాను. ఒకటి రెండు నెలలపాటు అలా చేస్తే.. చివరికి వారే నా దగ్గరికి వచ్చి ఒప్పందం చేసుకోవాలని చూస్తారు. అయితే.. అవన్నీ వృథా ప్రయత్నాలే అవుతాయి' అని ట్రంప్ అన్నారు. తన పాలనలో చరిత్రలోనే అత్యుత్తమ ఆర్థిక వ్యవస్థగా అమెరికా ఎదిగిందని పేర్కొన్నారు. రిపబ్లికన్లకు వచ్చే ఓట్లను సర్వేలు సరిగ్గా చూపించట్లేదని అసహనం వ్యక్తం చేశారు. అవకాశం వస్తే మరోసారి అధ్యక్ష స్థానానికి పోటీ చేయడానికీ తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. అయితే రాజ్యాంగ నిబంధనలు కఠినంగా ఉండడం వల్ల అది సాధ్యం కాకపోవచ్చని నిరాశ వ్యక్తం చేశారు.

చైనా.. రష్యా కంటే మెరుగ్గా గూఢచర్యం చేస్తాం..

తన ప్రత్యర్థులపై గూఢచర్యం చేయడంలో చైనా, రష్యా ల కంటే మెరుగ్గా అమెరికా పని చేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా సైనిక స్థావరాలపై చైనా, రష్యా గూఢచర్యం చేస్తున్నాయని నిఘా అధికారులు తనకు చెప్పిన విషయాన్ని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. వారి మాదిరిగానే వాషింగ్టన్ కూడా బీజింగ్, మాస్కోలను నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. ఆ విషయం గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. చైనా ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరించడానికి కుట్ర పన్నినందుకుగానూ అక్టోబర్ 30న లిరెన్, యువాన్స్ చెన్ అనే ఇద్దరు చైనా జాతీయులకు అమెరికా న్యాయ శాఖ 30నెలల జైలు శిక్ష విధించింది.

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు పూర్తైన వెంటనే ఇరాన్‌పై దాడులు ప్రారంభించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కోరారు. అయితే ఆ దేశంతో ఒప్పందం చేసుకోవడానికి ప్రస్తుతం శాంతి చర్చలు కొనసాగించాలని తాను భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. శనివారం ఇరువురు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు.

ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది.. తక్షణమే సాయం అందించండి

అర్నబ్ తుపాను కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో సోమవారం ఆయన సమావేశమై పరిస్థితిని వివరించారు. ఈ కష్టకాలంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుపాను సమాచారం అందిన వెంటనే స్పందించి, నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ), ఆధునిక టెక్నాలజీని సమర్థంగా ఉపయోగించుకోవడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను వెంటనే కేంద్రానికి పంపించాం" అని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఒకవైపు రాయలసీమలో ఎల్ నినో వంటి తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటే, మరోవైపు కోస్తా ప్రాంతం వరుస తుపానులతో అతలాకుతలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్నబ్ తుపాను మిగిల్చిన నష్టం నుంచి కోలుకోకముందే 'మురసు' రూపంలో మరో తుపాను ముప్పు పొంచి ఉందని గుర్తుచేశారు.తుపాను ప్రభావంతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం వివరించారు. ముఖ్యంగా కొబ్బరి, అరటి తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయని తెలిపారు. కరవును తట్టుకునేందుకు రాయలసీమ రైతులను ఉద్యాన పంటల వైపు ప్రోత్సహిస్తుంటే, ఇప్పుడు ఆ పంటలు కూడా తుపానుల బారిన పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆక్వా కల్చర్ రంగానికి కూడా భారీ నష్టం వాటిల్లిందని, మత్స్యకారుల పడవలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో హుద్ హుద్, తిత్లీ, మొంథా వంటి తుపానులు కూడా రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశాయని ప్రస్తావించారు.ప్రస్తుత

7 వేల మంది సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని, సహాయక చర్యలను ఆర్టీజీఎస్ ద్వారానే పర్యవేక్షిస్తున్నామని సీఎం వివరించారు. కేంద్ర బృందం త్వరితగతిన తమ సిఫార్సులను కేంద్రానికి అందించి, రాష్ట్రానికి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కేంద్రం అందించే సత్వర సాయం, ఈ కష్టకాలంలో రాష్ట్రానికి ఎంతో ఊరటనిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

- మొదటి పేజీ తరువాయి

ఈ లక్ష్య సాధన కోసం కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తితో అందరూ ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికలపై తాను, పవన్ కల్యాణ్, మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పులివెందులలో హింస సృష్టించేందుకు కొందరు ప్రయత్నించినా కూటమి నేతలు సంయమనం పాటించారని అభినందించారు. త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవైపు ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల సహాయక చర్యలను సమర్థంగా చేపడుతున్నామని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టామని చంద్రబాబు వివరించారు.ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

గ్రోక్ ఏఐతో ఆదాయం కంటే ఖర్చే ఎక్కువ

ఉత్పాదకత పెంచుకోవడానికి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వైపు చూస్తున్నాయి. అయితే, ఈ టెక్నాలజీ నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతుండటంతో సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం ఇదే విషయంపై స్పందించారు. తన 'ఎక్స్' సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోని 'గ్రోక్' ఏఐ చాట్‌బాట్‌కు వస్తున్న ఆదాయం కంటే నిర్వహణ ఖర్చే ఎక్కువగా ఉందని ఆయన అంగీకరించారు.ఎక్స్‌లోని ప్రీమియం యూజర్లు కొందరు, తమ వారపు గ్రోక్ వినియోగ పరిమితి వేగంగా అయిపోతోందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై స్పందించిన ఒక యూజర్, ఈ లిమిట్‌ను రీసెట్ చేయాలని మస్క్‌ను కోరారు. ఈ నేపథ్యంలోనే మస్క్ పైవిధంగా స్పందించారు. సర్వర్ ఖర్చులు మరింత పెరగకుండా ఉండేందుకే వినియోగంపై కఠినమైన పరిమితులు విధించాల్సి వస్తోందని ఆయన వివరించారు.

మరోవైపు, ఏఐ కోసం టెక్ కంపెనీలు చేస్తున్న అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది.

ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా వంటి దిగ్గజ సంస్థల మొత్తం అప్పు 2026 మధ్య నాటికి 578 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.54 లక్షల కోట్లు) చేరుకుందని తెలిపింది. 2025లో ఈ అప్పు 399 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ఏఐ టెక్నాలజీ అభివృద్ధి, నిర్వహణ ఎంత ఖర్చుతో కూడుకున్నదో స్పష్టం చేస్తోంది.

అమెరికాలో భారతీయులు నిరసన చేస్తే ఊరుకుంటారా?

- మొదటి పేజీ తరువాయి

అమెరికా పౌరసత్వం కలిగిన ఆయన.. నవంబర్ 14లోగా భారత్ విడిచి వెళ్లాలని ఇటీవల ఫారిన్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, వీటిని సవాలు చేస్తూ ఇమ్రాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం (.. ఈసీకి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నందుకు తీవ్రంగా మందలించింది. ఆయన ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (కార్డు కలిగిన అమెరికన్ పౌరుడని..కాబట్టి భారత పౌరుడిలా వ్యవహరించే హక్కు లేదని పేర్కొంది. అమెరికాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓ భారత పౌరుడు నిరసన తెలిపితే ఊరుకుంటారా అని ప్రశ్నించింది. అలా చేసిన భారతీయులను వెంటనే ఫ్లైట్ ఎక్కించి మరీ వెనక్కి పంపించేసేవారని కోర్టు వ్యాఖ్యానించింది. ర్యాలీలో పాల్గొన్న విషయంపై మీరు కోర్టుకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. 'చాలా ఏళ్లుగా భారత్‌లో ఉండడం వల్ల మీరు భారతీయుడు కాదనే విషయాన్ని మరిచిపోయి ఉంటారు. కానీ మీరు ఓసీఐ కార్డుదారు. కాబట్టి భారత పౌరుడిలా వ్యవహరించలేరు. సర్ ప్రక్రియ గురించి మాట్లాడటానికి.. దానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో పాల్గొనడానికి మీకు ఎటువంటి హక్కు లేదు. మీ జీవితంలో ఎక్కువ భాగం భారత్‌లోనే గడిపానని చెబుతున్నారు. బాలీవుడ్‌లో నటుడిగా స్థిరపడ్డారు. అయినా కూడా ఎందుకు ఇంకా భారత పౌరసత్వాన్ని స్వీకరించట్లేదు?" అని ధర్మాసనం ఇమ్రాన్‌ను ప్రశ్నించింది.

క్షమాపణలు చెప్పిన ఇమ్రాన్..

సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్నందుకు ఇమ్రాన్ ఖాన్ బాంబే హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. తాను అమెరికాలో జన్మించి, పుట్టుకతోనే అక్కడి పౌరసత్వం పొందినప్పటికీ.. తన జీవితమంతా భారత్‌లోనే గడిపానని పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న ఏ నిరసన సంస్థతో గానీ, వ్యక్తులతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనబోనని హామీ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొనడానికి క్షమాపణను అనుమతిగా భావించవద్దని స్పష్టం చేసింది. సెలబ్రిటీ హోదాలో ఉన్న వారి మాటలకు అభిమానులు, ప్రజలు ఆకర్షితులవుతారని పేర్కొంది. విదేశీయుల పట్ల భారత దేశ వైఖరి గురించి ప్రస్తావిస్తూ.. ఇక్కడి ప్రజలు 'వసుధైవ కుటుంబం' సూత్రాన్ని విశ్వసిస్తారని తెలిపింది. అయినప్పటికీ ఓసీఐ కార్డుదారులు భారత పౌరులకు కేటాయించిన రాజకీయ హక్కులను వినియోగించుకోలేరని పునరుద్ఘాటించింది. తదుపరి విచారణను డిసెంబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు 'లీవ్ ఇండియా' నోటీసు' గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది.

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్-2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది.నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్-2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి.

రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్ పరిధిలోని రాయదుర్గం-కోకాపేట, పాతబస్తీ పరిధిలోని ఎంజీబీఎస్-చంద్రాయణగుట్టతో పాటు ఇతర శివారు ప్రాంతాలను

కలిపే కారిడార్లను ప్రతిపాదించారు.

మరోవైపు ప్రభుత్వ రుణాల పద్దు కింద కేటాయించిన రూ.125 కోట్లతో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థిక బకాయిలకు సంబంధించిన అవసరాలను సమతుల్యం చేయాలని భావిస్తున్నారు. ఈ నిధుల కేటాయింపుతో ఫేజ్-2 పనులకు సంబంధించిన తదుపరి చర్యలు ముందుకు సాగనున్నాయి.

ఎన్నికల సంఘం అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణం

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తొత్తుగా మారిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అక్రమాలే ఇందుకు నిదర్శనమని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థే అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణమని ఆయన మండిపడ్డారు.పులివెందులలో 80 పోలింగ్ బూత్‌లకు గాను 70 చోట్ల తమ పార్టీ ఏజెంట్లను టీడీపీ గూండాలు అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. పోలీసుల సహకారంతోనే బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారు దాడులకు పాల్పడి, తమ ఏజెంట్లను బూత్‌ల నుంచి బయటకు లాగేశారని తెలిపారు. ఓటర్ల స్లిప్పులు లాక్కొని, బూత్‌లను ఆక్రమించి రిగ్గింగ్, సైక్లింగ్‌కు పాల్పడ్డారని, వీటికి స్పష్టమైన వీడియో ఆధారాలున్నాయని పేర్కొన్నారు.అయితే, 70 బూత్‌లలో అక్రమాలు జరిగితే, కేవలం 4 బూత్‌లలో మాత్రమే రీపోలింగ్‌కు ఆదేశించడం దారుణమని జగన్ అన్నారు. ఇది ప్రజలను మభ్యపెట్టే కంటితుడుపు చర్య కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వాటిని స్వేచ్ఛాయుత ఎన్నికలు అంటారా? అంటూ ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ తరహా ఘటనలు కేవలం పులివెందులకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా జరిగాయని జగన్ తెలిపారు. కడప, తిరుపతి, కర్నూలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం కార్పొరేషన్లతో పాటు మాచర్ల, కుప్పం, పుత్తూరు, నంద్యాల వంటి అనేక మున్సిపాలిటీల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని... గెలుపు ఆలస్యమైనా అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తాయని ఆయన పునరుద్ఘాటించారు.

వైసీపీలో తీవ్ర మనోవేదన అనుభవించా..11న పార్టీని ప్రకటిస్తా

వైసీపీలో తాను తీవ్రమైన మనోవేదనకు గురైనట్లు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ శ్రేయస్సు, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ పార్టీ అవతరించబోతోందని ఆయన ప్రకటించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈనెల 11వ తేదీన కొత్త పార్టీ పేరును వెల్లడిస్తానని స్పష్టం చేశారు.టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు ఓవీ రమణ తన పార్టీలో చేరడం సంతోషంగా ఉందని విజయసాయి రెడ్డి తెలిపారు. తన కొత్త పార్టీలో ఓవీ రమణ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తారని విజయసాయిరెడ్డి వెల్లడించారు. తామిద్దరం గతంలో టీటీడీ బోర్డులో కలిసి పనిచేశామని, ఆ అనుభవంతో పార్టీని ముందుకు తీసుకెళతామని అన్నారు. కాగా, ఓవీ రమణ టీడీపీకి రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. తాను విజయసాయి పార్టీలో చేరుతున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే, రమణను విజయసాయి తన పార్టీలోకి స్వాగతించారు.ఇక, నవంబర్ 11వ తేదీ, 11 గంటల 11 నిమిషాలకు పార్టీని ప్రకటించడంపై వస్తున్న ట్రోల్స్‌పైనా విజయసాయి స్పందించారు. "పండితులు సూచించిన ముహూర్త బలం ప్రకారమే ఆ సమయాన్ని ఎంచుకున్నాం. ఎవరినీ కించపరచాలనే ఉద్దేశం లేదు. ఎవరో భుజాలు తడుముకుంటే నేను ఏమీ చేయలేను" అని ఆయన వివరణ ఇచ్చారు. తాను మెంటార్‌గా ఉంటూ అన్ని వర్గాల వారికి అధికారం కట్టబెట్టేలా పనిచేస్తానని, ప్రజల ఆశీర్వాదంతో ఏపీలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదుగుతామని విజయసాయి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత అన్ని జిల్లాల నుంచి చేరికలు ఉంటాయని తెలిపారు.

బిల్‌బోర్డ్స్ హ్యాక్.. నీలి చిత్రాల ప్రదర్శన..

- మొదటి పేజీ తరువాయి

ఈజిప్ట్, మలేషియా, బ్రెజిల్, చైనా, ఇరాక్ దేశాల్లోని బిల్‌బోర్డ్‌లను గత వారం హ్యాకర్లు హైజాక్ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో స్క్రీన్లపై ప్రకటనల స్థానంలో అశ్లీల చిత్రాలు దర్శనమిచ్చాయని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈజిప్ట్ రాజధాని కైరోలో అత్యంత రద్దీగా ఉండే రహదారిపై ఉన్న బిల్‌బోర్డ్‌పై కనిపించిన దృశ్యాలు వాహనదారులను ఒక్కసారిగా షాక్‌కు గురిచేశాయి. కొందరు ఆ దృశ్యాలను రికార్డు చేసి, సోషల్ మీడియాలో షేర్ చేయడంతో హ్యాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. బిల్‌బోర్డ్‌కు సంబంధించిన కంపెనీ వెబ్‌సైట్‌పై సైబర్ దాడి జరిగిందని, అనధికారిక ఫుటేజీ ఒకే సమయంలో పలు దేశాల్లో ప్రసారమైందని ఈజిప్ట్ ప్రభుత్వం వెల్లడించింది. దీనిపై దర్యాప్తు జరుగుతోందని తెలిపింది. అయితే, కంపెనీ పేరు మాత్రం బయటపెట్టలేదు.లోపాలున్న వ్యవస్థలను గుర్తించి, డిజిటల్ బిల్‌బోర్డుల్లోకి చొరబడేందుకు కొన్ని గంటల సమయం మాత్రమే పట్టిందని టెలిగ్రామ్‌లో హ్యాకర్ల బృందం ప్రకటించుకుంది. ఎల్ఈడీ స్క్రీన్లకు కంటెంట్‌ను ప్రసారం చేయడానికి ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను వాడుకున్నట్లు చెప్పింది. మలేషియా, బ్రెజిల్‌లోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో యాడ్ సంస్థలు వెంటనే బిల్‌బోర్డులను స్విచాఫ్ చేశాయి.తాము బిల్ బోర్డులను లక్ష్యంగా చేసుకున్నది డబ్బు కోసమో, బెదిరించడం కోసమో కాదని హ్యాకర్లు చెప్పడం గమనార్హం. వారు ప్రకటనల కంపెనీల భద్రతా చర్యలను ఎగతాళి చేశారు. మౌలిక సదుపాయాలపై లక్షల డాలర్లు ఖర్చు చేస్తున్నాయి కానీ.. ఇంటర్నెట్‌తో అనుసంధానించిన స్క్రీన్లను మాత్రం రక్షించుకోలేకపోతున్నారంటూ లోపాలను ఎత్తిచూపారు. తగిన భద్రత లేని స్క్రీన్లను హ్యాక్ చేయగలమని చూపించడమే తమ ఉద్దేశమని, చైనా, ఇరాక్‌లోని బిల్ బోర్డులను టార్గెట్ చేశామని తెలిపారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా


గరుడ వాహనంపై మలయప్ప స్వామి దివ్యవిహారం



- అంగరంగ వైభవంగా కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- కనులపండువగా గరుడ సేవ.. గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఆలయ మాడవీధులు.. విశేషంగా ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు









ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 2: సకల లోక సంరక్షకుడు, కలియుగ ప్రత్యక్ష దైవం, భక్తజన కోటికి కొంగుబంగారమైన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా, ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతూ కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆశ్వయుజ బహుళ అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గరుడ వాహన సేవ భక్తజనుల ఆధ్యాత్మిక అనుభూతికి అద్దం పట్టింది. సర్వాలంకార భూషితుడై, మలయప్ప స్వామి అలంకరణలో గరుడ వాహనాన్ని అధిరోహించిన శ్రీ వేంకటేశ్వరుడు భక్తులకు దివ్యమంగళ దర్శనమివ్వడంతో వాడపల్లి క్షేత్రం గోవింద నామస్మరణతో పులకించిపోయింది. వేలాది భక్తుల భక్తి పారవశ్యం, వేదమంత్రాల మంగళధ్వనులు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన స్వామివారి వాహన సేవ బ్రహ్మోత్సవాల వైభవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వేకువజాము నుంచే వైదిక కార్యక్రమాల సందడి

బ్రహ్మోత్సవాల నాలుగవ రోజు సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. స్వామివారి సన్నిధిలో అర్చకులు ఆగమోక్త విధివిధానాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి ఆలయ ప్రాంగణాన్ని పవిత్రీకరించారు. అనంతరం పంచామృత మండప ఆరాధన, మహాస్నపనం, ప్రధాన హోమాలు, దుష్టగ్రహ పరిహారార్థం మహా సుదర్శన హోమం నిర్వహించారు.

విశ్వశాంతి, లోకకల్యాణం, సకల జనుల సౌభాగ్యం ఆకాంక్షిస్తూ నిర్వహించిన వైదిక క్రతువులు భక్తులను ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తాయి. అనంతరం తోమాలసేవ, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ రకాల సుగంధ పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించి పుష్పార్చనలు సమర్పించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం భక్తి భావనతో ప్రతిధ్వనించింది.

ఆగమశాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు

ఆలయ ప్రధాన అర్చకులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆచార్యులు, అర్చక బృందం అత్యంత నిష్ఠతో, ఆగమశాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా బ్రహ్మోత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూర్వీకుల నుంచి కొనసాగుతున్న వైదిక సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి పూజా ఘట్టాన్ని నియమబద్ధంగా నిర్వహించడం విశేషం. పుష్పాలంకరణలు, వివిధ రకాల నైవేద్య సమర్పణలు, మంత్రపుష్పాలు, హారతులతో స్వామివారికి విశేష సేవలు సమర్పించారు. ఉదయం పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ధర్మకర్తల భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు ఏపుగంటి విజయకుమారి దంపతులు, చింతపల్లి సత్యనారాయణ దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి కృపాకటాక్షాలు సమస్త ప్రజానీకంపై ప్రసరించాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు.

సాయంత్రం వైదిక క్రతువులతో గరుడ సేవకు అంకురార్పణ

సాయంత్రం 5.30 గంటల నుంచి స్వామివారి గరుడ వాహన సేవకు సంబంధించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వస్తివాచనం, ప్రధాన హోమాలు, శ్రీ స్వామివారికి విశేషార్చన, చతుర్వేద స్వస్తి, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు తదితర కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

వేదమంత్రాల పవిత్ర నాదాల మధ్య నిర్వహించిన ఈ వైదిక కార్యక్రమాలు గరుడ వాహన సేవకు ఆధ్యాత్మిక నేపథ్యాన్ని అద్దాయి. అనంతరం మలయప్ప స్వామి అలంకరణలో స్వామివారిని విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చారు.

మలయప్ప అలంకరణలో మురిపించిన మూర్తి

స్వర్ణాభరణాలు, వివిధ రకాల పుష్పమాలికలు, సుందరమైన అలంకరణలతో మలయప్ప స్వామి రూపంలో దర్శనమిచ్చిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యమంగళ స్వరూపం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గరుడ వాహనంపై సాక్షాత్కరించిన శ్రీనివాసుని అలంకార వైభవాన్ని తిలకించిన భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. స్వామివారి దివ్యరూపాన్ని కనులారా దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గరుడ వాహనంపై స్వామివారు మాడవీధుల్లో విహరిస్తుండగా భక్తులు ఇరువైపులా బారులుతీరి నిలబడి కర్పూర హారతులు సమర్పించారు. కొందరు భక్తులు పుష్పవర్షం కురిపిస్తూ స్వామివారికి భక్తిపూర్వక స్వాగతం పలికారు. మరికొందరు చేతులు జోడించి నమస్కరిస్తూ తమ మొక్కులు చెల్లించుకున్నారు.

రెండు కళ్లు చాలనంతటి అపురూప అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారిని చూసి భక్తులు గోవిందా.. గోవిందా.. అంటూ చేసిన నామస్మరణతో ఆలయ మాడవీధులు మార్మోగాయి. గరుడ వాహనంపై అధిష్ఠించిన స్వామివారి దివ్యదర్శనం భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చింది.

సంప్రదాయ కళారూపాలతో సాంస్కృతిక వైభవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహన సేవ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, భరతనాట్య కళారూపాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయ కళావైభవాలను ప్రతిబింబించేలా కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

మృదంగ నాదాలు, డోలు వాయిద్యాలు, సన్నాయి స్వరాలు, బ్యాండ్ మేళాల మంగళధ్వనుల నడుమ సాగిన స్వామివారి ఊరేగింపు కనులపండువగా నిలిచింది. ఒకవైపు వేదమంత్రాల ఘోష, మరోవైపు భక్తి కీర్తనలు, ఇంకోవైపు సంప్రదాయ వాయిద్యాల నాదాలు కలగలిసి వాడపల్లి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కళా వేదికగా మార్చాయి.

భక్తుల సౌకర్యాలకు ఆలయ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు

14వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. భక్తుల దర్శన సౌకర్యాలు, వాహన సేవ వీక్షణ, ఆలయ పరిసరాల్లో అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు తెలిపారు.బ్రహ్మోత్సవాల నిర్వహణలో భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. స్వామివారి ఉత్సవాలను భక్తుల భాగస్వామ్యంతో మరింత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తిపారవశ్యంలో వాడపల్లి క్షేత్రం

కలియుగ వైకుంఠంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో జరుగుతున్న 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సనాతన ధర్మ సంప్రదాయాల సమ్మేళనంగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ నిర్వహిస్తున్న విశేష పూజలు, వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.ముఖ్యంగా సోమవారం నిర్వహించిన గరుడ వాహన సేవలో మలయప్ప స్వామి దివ్యదర్శనం భక్తుల హృదయాల్లో భక్తి భావాన్ని మరింత పెంపొందించింది. స్వామివారి కృపాకటాక్షాలతో సకల జనులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం గరుడ సేవ వైభవంతో మరోసారి ఆధ్యాత్మిక చరిత్రలో తనదైన ప్రత్యేకతను చాటుకుంది







ఆలమూరులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సన్నాహక ఏర్పాట్లు

- పీఓ, ఏపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమం



ఆలమూరు,పెన్ పవర్,నవంబర్ 02:మండల కేంద్రమైన ఆలమూరులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల అధికారులు సన్నాహక ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక డాక్టర్ బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ అధికారులు (పీఓ), సహాయ పోలింగ్ అధికారులు (ఏపీఓ)లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలమూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) లక్ష్మీ ప్రత్యూష, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్వో), ఎంపీడీవో ఎ. రాజు ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల విధుల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల నియమ నిబంధనలు, పోలింగ్ కేంద్రాల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విధులకు కేటాయించిన పీఓలు, ఏపీఓలతో పాటు ఎంఈవోలు అప్పాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధిత టీడీపీ నాయకుడికి చిన్నబాబు ఆర్థిక చేయూత

చొల్లంగి శ్రీనివాస్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల సాయం



ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 02:ఆపదలో ఉన్న పార్టీ నాయకులకు అండగా నిలుస్తూ పెనికేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు తన సహృదయతను చాటుకున్నారు. ప్రమాదవశాత్తు గాయపడి కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ నాయకుడు చొల్లంగి శ్రీనివాస్‌ను ఆయన పరామర్శించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్య చికిత్సకు అవుతున్న ఖర్చుల నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనుకోని ప్రమాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.కష్టాల్లో ఉన్నవారిని గుర్తించి, వారికి అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందించడం ద్వారా ఈదర చిన్నబాబు తన సేవాభావాన్ని చాటుకుంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఆయన అందించిన ఆర్థిక సహాయంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

టిడిపిలో చేరిన పల్లిబోయిన రాజేష్ టీమ్



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 2 : స్థానిక రావులమ్మ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో వైసీపీ యువ నాయకుడు పల్లిబోయిన రాజేష్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది వైసీపీకి రాజీనామా చేస కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, టిడిపి జడ్పిటిసి అభ్యర్థి జీను మణి బాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపునకు 96 కౌంటింగ్ టేబుళ్లు సిద్ధం

కాకినాడ, నవంబర్ 2 పెన్ పవర్:కాకినాడ జిల్లాలోని ఆరు పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు నవంబర్ 3వ తేదీన నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేపట్టింది. పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని, గొల్లప్రోలు, ఏలేశ్వరం పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.పెద్దాపురంలో రామారావుపేటలోని బ్రాహ్మణ కళ్యాణ మండపం, సామర్లకోటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం యోగా హాల్, పిఠాపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తునిలో బ్యాంక్ కాలనీలోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల, గొల్లప్రోలులో శ్రీ సేట్ పెరాజీ లుంబాజీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఏలేశ్వరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.అన్ని కౌంటింగ్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పాటు ఆయుధాలతో కూడిన పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపును వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఆరు పట్టణ స్థానిక సంస్థలకు కలిపి మొత్తం 96 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. వీటిలో పెద్దాపురంలో 16, సామర్లకోటలో 18, పిఠాపురంలో 18, తునిలో 18, గొల్లప్రోలులో 8, ఏలేశ్వరంలో 18 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్‌తో పాటు ముగ్గురు కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా,నిబంధనల ప్రకారం పారదర్శకంగా లెక్కింపు పూర్తిచేసేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఆదిత్య యూనివర్సిటీలో సుస్థిర జీవనశైలి వారోత్సవాలు ప్రారంభం



పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై విద్యార్థులకు అవగాహన

గండేపల్లి పెన్ పవర్, (సూరంపాలెం), నవంబర్ 02: పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునే లక్ష్యంతో ఆదిత్య యూనివర్సిటీలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రిక్స్ (దీ=xజూ) సుస్థిర జీవనశైలి వారోత్సవాలు--2026 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్ యాక్టివిటీస్ డాక్టర్ డి. కిషోర్ ప్రారంభించారు.ఈ వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 1వ తేదీన సుస్థిర జీవనశైలి ప్రతిజ్ఞతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నవంబర్ 2వ తేదీన అధ్యాపకులు, విద్యార్థులకు డెస్క్ యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రోజువారీ జీవన విధానంలో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడంతో పాటు విద్యుత్, నీటి పొదుపు, సుస్థిర ఆహార విధానాలు, వ్యర్థాల తగ్గింపు వంటి అంశాలపై వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించనున్నారు.బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమి స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలు పర్యావరణహిత జీవన విధానాల ప్రాధాన్యతను తెలియజేయనున్నాయి. ప్రకృతి వనరులను సంరక్షించడం, పర్యావరణానికి హాని కలగకుండా జీవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, వివిధ క్లబ్‌ల సమన్వయకర్తలు, విద్యార్థి వాలంటీర్లు, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కన్వీనర్ డాక్టర్ ఐ.వి.వి. వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. వారం రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతతో పాటు ఆరోగ్యకరమైన, సుస్థిర జీవనశైలిపై అవగాహన మరింత పెంపొందుతుందని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

ఆదిత్య కళాశాలలో ఐబీఎం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ

శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన క్రిస్ సాఫ్ట్‌వేర్ సాల్యూషన్స్ సీఈఓ కృష్ణారెడ్డి



కాకినాడ, పెన్‌పవర్, నవంబర్ 2:విద్యార్థులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఐసీటీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఐబీఎం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. క్రిస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈఓ కె. కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ డాక్టర్ ఎస్. దినకర్ రెడ్డి, రీజినల్ మేనేజర్ ఎన్. శ్రీనివాస్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాల పరిజ్ఞానానికే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నూతన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ముఖ్య అతిథి కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐసీటీ అకాడమీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఐబీఎం శిక్షణ ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహనతో పాటు పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ శిక్షణ భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చు కోవడానికి దోహదపడుతుందని తెలిపారు.ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ డాక్టర్ ఎస్. దినకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం తో విద్యార్థులను భవిష్యత్తు సాంకేతిక అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు.సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాలు అవసరమన్నారు. ఇలాంటి పరిశ్రమ ఆధారిత శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు కెరీర్ అభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు.అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు విశేష ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులు తరగతి గది అభ్యాసంతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి. సత్యనారాయణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ సాయి కిషోర్, ప్లేస్‌మెంట్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ్ ఎనర్జీపై ప్రతిజ్ఞ



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 2: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సోమవారం బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్‌స్టైల్ వీక్ సేవ్ ఎనర్జీ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శక్తి ఆదా యొక్క ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేశారు. విద్యుత్ శక్తిని వృథా చేయకుండా ఎలా కాపాడుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. అనవసరంగా లైట్లు, ఫ్యాన్లు వెలిగించకుండా ఉండటం, ఛార్జర్లు వాడిన తర్వాత స్విచ్ ఆఫ్ చేయడం వంటి నిత్య జీవితంలో పాటించాల్సిన చిన్న చిన్న మార్పుల ద్వారా పెద్ద ప్రభావాన్ని చూపవచ్చని విద్యార్థులకు వివరించారు.

శృంగాధర, పెద మల్లాపురం , వేళంగి గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు ఘన స్వాగతం....

పూలవర్షం, హారతులతో మహిళల ఆత్మీయ అభిమానం

మాజీ జెడ్పిటిసి బచ్చల గంగ ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థులు ఇంటింటా ప్రచారం...



శంఖవరం పెన్ పవర్ నవంబర్ 02:- కాకినాడ జిల్లా శంఖవరం మండలంలోని శృంగాధర, పెద మల్లాపురం, వేళంగి గ్రామాల్లో కూటమి అభ్యర్థుల తరపున మాజీ జడ్పీటీసీ బచ్చల గంగ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శంఖవరం జడ్పీటీసీ అభ్యర్థి కంచిబోయిన వెంకటరమణ (శ్రీను), పి. మల్లాపురం ఎంపీటీసీ అభ్యర్థి పసగడుగుల అమ్మాజీ తరఫున ఆమె స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చేరుకున్న అభ్యర్థులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, పూలవర్షం కురిపిస్తూ తమ ఆత్మీయతను చాటుకున్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించగా, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.మాజీ జడ్పీటీసీ బచ్చల గంగ గ్రామస్తులను కలుసుకుంటూ కూటమి అభ్యర్థులను పరిచయం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలు, గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించడం వంటి అంశాలపై చర్చించారు.శంఖవరం జడ్పీటీసీ అభ్యర్థి కంచిబోయిన వెంకటరమణ (శ్రీను), ఎంపీటీసీ అభ్యర్థి పసగడుగుల అమ్మాజీ కూడా గ్రామస్తులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో మమేకమవుతూ తమ అభ్యర్థిత్వాన్ని వివరించారు.ఈ సందర్భంగా బచ్చల గంగ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల తరఫున గ్రామాల్లో ప్రజలను కలుసుకుంటూ ప్రచారం నిర్వహిస్తున్నామని, ప్రజల సమస్యలు తెలుసుకుని గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు



కాకినాడ, నవంబర్ 2 పెన్ పవర్:కాకినాడ జిల్లాలో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు.సోమవారం కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, భద్రతా చర్యలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్, బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ ప్రతి దశలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడరాదని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు ఏర్పాట్లు, వివిధ శాఖల సమన్వయంతో అమలు చేస్తున్న చర్యలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ డి. శ్రీలలిత, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్. అప్పారావు (బీఎస్పీ), సీహెచ్. రమేష్ (బీజేపీ), పి. వీరబాబు (సీపీఎం), పి. శ్రీనివాసు (ఐఎన్సీ), జి. సాయిబాబా (టీడీపీ), ఎ. సత్యనారాయణ (జనసేన), ఆర్. వెంకటేశ్వరరావు (వైఎస్సార్‌సీపీ), ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిక్స్ వారోత్సవాలు ప్రారంభం.

బ్రిక్స్ దేశాల ఐక్యత, అంతర్జాతీయ సహకారంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి: ప్రిన్సిపాల్



ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 2: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే బ్రిక్స్ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బ్రిక్స్ కూటమి దేశాల మధ్య ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థుల్లో అంతర్జాతీయ అవగాహనతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమాల లక్ష్యమన్నారు.వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్యకరమైన జీవన విధానం, ఇంధన వనరుల పరిరక్షణ, జల సంరక్షణ, స్థిరమైన ఆహార వ్యవస్థ, ప్లాస్టిక్ నివారణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల తగ్గింపు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.వైస్ ప్రిన్సిపాల్ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భావితరాలకు సహజ వనరులను అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. ప్రయాగ మూర్తి ప్రగడ, ఇకో క్లబ్ కోఆర్డినేటర్ డా. ఎస్.కె. మదీనా, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీ పీఠమే లక్ష్యంగా ఆర్యవటంలో చందాల ఆదినారాయణ దూకుడు

మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటనతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం
గెలుపే ధ్యేయంగా ఇంటింటి ప్రచారం



కాజులూరు, పెన్‌పవర్, నవంబర్ 2:కాజులూరు మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) పీఠాన్ని ఆర్యవటం గ్రామానికి కేటాయించనున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించడంతో ఆర్యవటం టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి చందాల ఆదినారాయణ ఎన్నికల ప్రచారంలో మరింత దూకుడు పెంచారు. కూటమి తరఫున ఎంపీపీ అభ్యర్థిగా ఆదినారాయణ పేరును మంత్రి ప్రకటించడంతో ఆయన అనుచరులు, టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీ పీఠాన్ని అధిరోహించాలనే లక్ష్యంతో ఆదినారాయణ గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

దాదాపు 12 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని నమ్ముకుని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఆదినారాయణకు ఈసారి అధిష్ఠానం ఎంపీటీసీ టికెట్ కేటాయించింది. ఇప్పటివరకు పార్టీలో ఎలాంటి పదవులు ఆశించకుండా పనిచేసిన ఆయనకు ఈ ఎన్నికల్లో అవకాశం కల్పించడం పట్ల స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్యవటం నుంచి టీడీపీ జెండా ఎగురవేస్తే ఎంపీపీ పదవి కూడా గ్రామానికే దక్కుతుందన్న ఆశాభావాన్ని కూటమి నాయకులు వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ప్రకటనతో ఆర్యవటంలో రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఆదినారాయణ జనసేన జడ్పీటీసీ అభ్యర్థిని కూటి శేషారత్నంతో కలిసి సమన్వయంతో ప్రచారం సాగిస్తున్నారు. ఆర్యవటం పరిధిలోని చందాలవారిపేట, ముత్తావారిగరువు, ఎస్సీ పేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ మద్దతు కోరుతున్నారు. జడ్పీటీసీ అభ్యర్థి కూటి శేషారత్నానికి గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీటీసీ అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఓటు నమూనా పత్రాలు, కూటమి అభ్యర్థుల గుర్తులతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలే తన బలం..

రాజకీయాలతో పాటు గ్రామంలో సేవా కార్యక్రమాల ద్వారా ఆదినారాయణ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తన పేరుతో ట్రస్టును ఏర్పాటు చేసి గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని కూటమి నాయకులతో కలిసి వాటి పరిష్కారానికి చొరవ చూపడం ఆయనకు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. విద్యావంతుడిగా, సహనశీలిగా, అందరితో ఆప్యాయంగా మెలిగే వ్యక్తిగా ఆయనకు గ్రామంలో మంచి గుర్తింపు ఉందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేసిన అనుభవం కూడా ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. విద్యావంతుడు కావడం,గ్రామ సమస్యలపై అవగాహన కలిగి ఉండటం, ప్రజలకు అందుబాటులో ఉండటం తన విజయానికి దోహదపడతాయని ఆయన మద్దతుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ప్రచారంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ తనకు ఒక అవకాశం కల్పించాలని ఆదినారాయణ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. పార్టీ పెద్దలు, గ్రామంలోని ప్రముఖులను కలుస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. మరోవైపు కూటమి నాయకులు, కార్యకర్తలు కూడా ఆయన విజయానికి సమష్టిగా కృషి చేస్తున్నారు.మండల ఎంపీపీ పదవిని ఆర్యవటానికి కేటాయిస్తూ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన ప్రకటనతో ఆదినారాయణ గెలుపుపై టీడీపీ శ్రేణుల్లో అంచనాలు పెరిగాయి. ఎంపీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు, జడ్పీటీసీ ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులిద్దరినీ గెలిపించాలని ఆదినారాయణ ఆర్యవటం గ్రామ ప్రజలకు వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

జడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్థులతో
భద్రవరంలో కూటమి ఎన్నికల ప్రచారం.



ఏలేశ్వరం, పెన్ పవర్,నవంబర్ 2 : మండల పరిధి భద్రవరంలో కూటమి అభ్యర్థులు జడ్పీటీసీ అభ్యర్థి పైలా సుభాష్ చంద్రబోస్, ఎంపీటీసీ అభ్యర్థి కాటుకపల్లి సీతారత్నం ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, మాజీ ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పెంటకోట మోహన్, జనసేన నాయకుడు వరుపుల సాయికిరణ్ తదితరులతో కలిసి ఇంటింటా ప్రచారం చేస్తూ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ నెల 5న జరిగే జడ్పీటీసీ ఎన్నికలో కమలం గుర్తుపై, భద్రవరం ఎంపీటీసీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

గండేపల్లిలో కూటమి అభ్యర్థి లంజపల్లి దేవి ప్రచార జోరు



గండేపల్లి, పెన్ పవర్, నవంబర్ 02 స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో గండేపల్లి ఎంపీటీసీ-1 కూటమి అభ్యర్థి లంజపల్లి దేవి దూకుడు పెంచారు. గెలుపే లక్ష్యంగా గ్రామంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ప్రతి ఇంటి గడప తొక్కి ఓటర్లను నేరుగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని చెబుతూ ఎంపీటీసీ-1 స్థానంలో తనకు అవకాశం కల్పించాలని కోరారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కాగా, లంజపల్లి దేవి ప్రచారానికి గ్రామస్తులు, మహిళలు, వృద్ధులు ఘన స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థి విజయానికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

కాజులూరు--1లో ఫ్యాన్ గుర్తుతో విజయదుర్గ విస్తృత ప్రచారం



కూటమి పార్టీల మధ్య అభ్యర్థుల పోటీ
వైసీపీ తరఫున ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న యాళ్ల విజయదుర్గ

కాజులూరు, పెన్‌పవర్, నవంబర్ 2:కాజులూరు మండలంలోని కాజులూరు--1 ఎంపీటీసీ స్థానంలో ఎన్నికల ప్రచారం ఆసక్తికరంగా మారింది. ఈ స్థానంలో బీజేపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీలో ఉండటంతో త్రిముఖ పోటీ నెలకొంది. కూటమి పార్టీల మధ్య అభ్యర్థుల విషయంలో ఏకాభిప్రాయం కుదరక వేర్వేరు అభ్యర్థులు బరిలో నిలవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థిని యాళ్ల విజయదుర్గ ఇంటింటి ప్రచారంతో ఓటర్లను కలుస్తున్నారు.విజయదుర్గ తరఫున ఆమె భర్త యాళ్ల సత్తిబాబు కూడా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు.పార్టీకి కష్టకాలంలోనూ అండగా నిలిచి,ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వైఎస్సార్‌సీపీని వీడకుండా కొనసాగిన సత్తిబాబుకు స్థానికంగా పార్టీ నాయకులు,కార్యకర్తలతో మంచి పరిచయాలు ఉన్నాయని అనుచరులు చెబుతున్నారు.అందరితో కలుపుగోలుగా మెలగడం,కష్టం వచ్చిన వారికి తనవంతు సహాయం అందించే స్వభావం ఆయనకు గుర్తింపు తెచ్చిందని పేర్కొంటున్నారు.అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వం అన్ని అంశాలను పరిశీలించి విజయదుర్గకు అవకాశం కల్పించిందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. సత్తిబాబు గతంలో గ్రామంలో చేపట్టిన కార్యక్రమాలు, ప్రజలతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం విజయదుర్గ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావనకు వస్తున్నాయి.విజయదుర్గ తన భర్త సత్తిబాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. తనకు ఒక అవకాశం కల్పించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వినమ్రంగా అభ్యర్థిస్తున్నారు.వివిధ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందేందుకు ప్రయత్నిస్తున్నారు.మరోవైపు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో అమలైన సంక్షేమ పథకాలు తమ ప్రచారానికి ప్రధాన అంశాలని విజయదుర్గ, ఆమె మద్దతుదారులు పేర్కొంటున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల మద్దతు కోరుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

కాజులూరు--1 ఎంపీటీసీ స్థానంలో త్రిముఖ పోటీ నేపథ్యంలో అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని యాళ్ల విజయదుర్గ ఫ్యాన్ గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్తూ తన విజయానికి కృషి చేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పరిశీలించిన ఆర్డీవో



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 2: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ను పెద్దాపురం ఆర్డీవో కృష్ణమూర్తి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 5వ తేదీన జరిగే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 90 ఓట్లు పోలైనట్లు ఆర్వో శ్రీనివాసరావు, ఏఆర్ఓ జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

లంపకలోవలో 62 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ చేసిన గొంతిన సురేష్



కిర్లంపూడి,ప్రత్తిపాడు,పెన్ పవర్,నవంబర్,02:ప్రత్తిపాడు మండలం లంపకలోవలో స్వర్గీయ గంటా సత్యనారాయణ 7వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 26న నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి లోపాలను గుర్తించిన 62 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. గంటా సత్యనారాయణ కుటుంబ సభ్యుల సహకారంతో లంపకలోవ సొసైటీ మాజీ అధ్యక్షుడు గొంతిన సురేష్ లబ్ధిదారులకు కళ్లజోళ్లను అందజేశారు. కాకినాడ అంజు కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించేందుకు కూడా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రత్తిపాడులో హోరెత్తిన కూటమి ఎన్నికల ప్రచారం -కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే సత్యప్రభ భారీ రోడ్‌షో.



కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్,02,కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూటమి పార్టీల ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రచార బరిలోకి దిగి భారీ రోడ్‌షో నిర్వహించారు. ఎంపీపీ అభ్యర్థి యాళ్ల మంగాదేవి జగదీష్, జడ్పీటీసీ అభ్యర్థి రొంగల సత్యనారాయణ, ఎంపీటీసీ-1 అభ్యర్థి మోర్త పార్వతి లాజర్‌తో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. రోడ్‌షోకు గ్రామంలో అడుగడుగునా అపూర్వ స్పందన లభించింది. పలు ప్రాంతాల్లో మహిళలు ఎమ్మెల్యే సత్యప్రభతో పాటు అభ్యర్థులకు పూలమాలలు వేసి, హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ప్రజల నీరాజనాలు, కార్యకర్తల నినాదాలతో ప్రచార ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఎన్నికల్లో శ్రీరామరక్షగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, రానున్న రోజుల్లోనూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు. అభివృద్ధి చేశాం.. చేస్తున్నాం.. చేస్తూనే ఉంటాం అంటూ కూటమి ప్రభుత్వ ప్రగతి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. కూటమి అభ్యర్థుల గెలుపు లాంఛనమే అన్న ధీమాతో ఆగకుండా, భారీ మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే సత్యప్రభ ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,కూటమి నాయకులు యాళ్ల విశ్వేశ్వరరావు, యర్రాబత్తుల గోవిందు నాయుడు, అంబటి బుజ్జి, గోపిశెట్టి శ్రీను, పోలిశెట్టి శ్రీనివాస్, వెలుగుల నాని, శెట్టిబత్తుల వీరబాబు, మదినే దొరబాబు, రావూరి తాతాజీ,గొడే హరీష్, శెట్టిబత్తుల నాని, సూర్నీడి వెంకటేష్, బొబ్బర ప్రసాద్‌తో పాటు భారీ సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో పోస్టల్ బ్యాలెట్ లో 60 ఓట్లు పోలింగ్



కిర్లంపూడి,పెన్ పవర్, నవంబర్ 02: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 60 ఓట్లు పోలైనట్లు ఆర్వో శ్రీనివాసరెడ్డి ,ఎంపీడీఓ బాయిశెట్టి హరికృష్ణ తెలిపారు.పోస్టల్ ఓటు ఉపయోగించుకున్న ప్రతిఒక్కరూ నియమించబడ్డ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని వారు తెలిపారు.ఈ ఎన్నికల ప్రక్రియ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి టి జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో వైసిపి జడ్పిటిసి అభ్యర్థి జోరుగా ఎన్నికల ప్రచారం.

- పాఠంశెట్టి సూర్యచంద్రకు అపూర్వ స్వాగతం పలికిన 4,5 వార్డుల ప్రజలు.



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్ 02: కిర్లంపూడి మండలం జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాఠంశెట్టి వెంకట శ్రీదేవికి మద్దతుగా ఆమె భర్త, ప్రముఖ సామాజికవేత్త పాఠంశెట్టి సూర్యచంద్ర సోమవారం మండల కేంద్రమైన కిర్లంపూడి నాలుగు,ఐదు వార్డులో ఉన్న రమణయ్యపేట కుమ్మరి వీధి, శెట్టిబలిజపేట, ఎస్సీ పేట, ఉట్ల గుడిసి వీధి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూర్యచంద్ర దంపతులు గతంలో ఒకసారి జామి మొక్క, మరొకసారి నిమ్మ మొక్క ఇంటింటికి పంపిణీ చేసారు. జనసేన పార్టీలో ఉన్న కాలంలో భార్య భర్తలు ఇద్దరూ ఇంటింటికి తిరిగి క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించారు.కూటమి పొత్తులో భాగంగా టిక్కెట్ రాకపోవడంతో జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసారు. ఇటీవల జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోట నరసింహం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సూర్యచంద్ర సతీమణి పాటంశెట్టి వెంకట శ్రీదేవిని జడ్పిటిసి ఎన్నికల బరిలో నిలిపారు. దీంతో నిత్యం ప్రజలమధ్యనే తిరుగుతున్న పాఠంశెట్టి సూర్యచంద్రకు సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా మహిళలు బ్రహ్మరథం పట్టి అపూర్వ స్వాగతం పలికారు. సూర్యచంద్ర ఓటర్లను ఓటు అడుగుతున్న తీరు ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ కార్యక్రమంలో 4,5 వార్డుల ఎంపీటీసీ అభ్యర్థులు దాడి రాజగోపాల్ కృష్ణ, మర్రా చిట్టిబాబు,జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు,వైసీపీ నాయకులు వేగి రామకృష్ణ, పెనగంటి రాజేష్, యల్లపు నానాజీ, దాడి పెదబుజ్జి, అప్పలరాజు, అధిక సంఖ్యలో వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎం.పి.టి.సి. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి సమగ్ర శిక్షణ

- ఎన్నికల విధుల్లో అప్రమత్తత.. నిబంధనల అమలులో ఖచ్చితత్వం పాటించాలి :అధికారుల సూచన



పెన్ పవర్ ఆత్రేయపురం నవంబర్ 2:: ఎం.పి.టి.సి. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించే దిశగా ఆత్రేయపురం మండలంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండలంలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రిసైడింగ్ అధికారులు (పి.ఓ.లు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఎ.పి.ఓ.లు)కు ఎన్నికల విధుల నిర్వహణపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు.ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, మండల విద్యాశాఖాధికారి పి.వి. ప్రసాదరావు, మండల పరిషత్ పరిపాలనాధికారి శ్రీ వి. రామస్వరూప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికల విధుల నిర్వహణకు నియమితులైన మాస్టర్ ట్రైనర్లు శిక్షణలో పాల్గొని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలు, నియమ నిబంధనలు, పోలింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన పద్ధతులపై సిబ్బందికి విపులంగా వివరించారు.ఈ సందర్భంగా పోలింగ్‌కు ముందు చేపట్టాల్సిన సన్నాహక ఏర్పాట్ల నుంచి పోలింగ్ ముగిసిన అనంతరం చేపట్టాల్సిన బాధ్యతల వరకు ప్రతి అంశాన్ని కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా ఓటర్ల గుర్తింపు ప్రక్రియ, బ్యాలెట్ పేపర్ల వినియోగం, ఓటు వేసే విధానం, ఓటు గోప్యత పరిరక్షణ, పోలింగ్ కేంద్రంలో పాటించాల్సిన క్రమశిక్షణ, ఎన్నికల సమయంలో ఎదురయ్యే సమస్యలను నిబంధనల పరిధిలో పరిష్కరించే విధానాలపై అవగాహన కల్పించారు.అంతేకాకుండా పోలింగ్ ప్రారంభానికి ముందు నిర్వహించాల్సిన మాక్ పోలింగ్ ప్రక్రియ, వివిధ రకాల ఎన్నికల రిజిస్టర్ల నిర్వహణ, పోలింగ్ సరళి నమోదు, బ్యాలెట్ పేపర్ల భద్రత వంటి కీలక అంశాలను ప్రాయోగికంగా వివరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రిని నిబంధనల ప్రకారం వేర్వేరుగా ప్యాక్ చేయడం, సీలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడం, ఎన్నికలకు సంబంధించిన రికార్డులు, ఇతర సామగ్రిని సంబంధిత అధికారులకు అప్పగించే విధానంపై ప్రత్యేకంగా శిక్షణ అందించారు.ఎన్నికల విధుల నిర్వహణ అనేది అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, ప్రతి అధికారి ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. వ్యక్తిగత అభిప్రాయాలకు, ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పి.ఓలు, ఎ.పి.ఓలకు దిశానిర్దేశం చేశారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత, ఓటు హక్కు గోప్యతే ప్రధాన ప్రామాణికాలుగా నిలవాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

మృతుల కుటుంబాలకు చిన్నబాబు పరామర్శ



ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 02:కష్టసుఖాల్లో ప్రజలకు అండగా నిలుస్తూ మానవీయతను చాటుకుంటున్న పెనికేరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వెంకటేశ్వర సంస్థల అధినేత ఈదర చిన్నబాబు పెనికేరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా కొమ్మిశెట్టి తారకరామారావు, రఘు సోదరుల అమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పేరూరి రాజు తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారి బాధలో పాలుపంచుకున్నారు. కష్టసమయాల్లో బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ అండగా నిలుస్తున్న చిన్నబాబు తీరును స్థానికులు అభినందించారు.

సోమరాయణంపేటలో తోట రవి, పాఠంశెట్టి కృష్ణవేణి విస్తృత ప్రచారం.

- జడ్పీటీసీగా గెలిపించి మరొకసారి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి
- కిర్లంపూడి జడ్పీటీసీ కూటమి అభ్యర్థి తోట రవి.



కిర్లంపూడి,పెన్ పవర్, నవంబర్, 02:కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమరాయణంపేటలో కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని సోమవారం జోరుగా నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి తోట రవి, పాలెం-సోమరాయణంపేటలో ఎంపీటీసీ అభ్యర్థి పాఠంశెట్టి కృష్ణవేణి ఇంటింటా ప్రచారం నిర్వహించి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ, గ్రామాల అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ అభ్యర్థి తోట రవి గతంలో ఎంపీపీగా పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేస్తూ, ప్రజలకు మరింత సేవ చేసేందుకు మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని అభ్యర్థులు స్పష్టం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మురళీ కృష్ణంరాజు పరామర్శ.



కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్,నవంబర్,02: ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో పలువురిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు ఎంఎంఎస్ చారిటబుల్ ట్రస్ట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు, ముదునూరి సీతారామరాజు పరామర్శించారు.ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన బొల్లు నానిబాబు సోదరుడు గిరి ఇటీవల కాలంలో కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించారు. విషయం తెలుసుకున్న మురళీ కృష్ణంరాజు సీతారామరాజు గిరి సోదరుడు నానిబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు వారి పవిత్ర ఆత్మకు చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు. అదే గ్రామానికి చెందిన వాకా నరసింహమూర్తి కుమారుడు(పవర్ ప్లాంట్) వాకా కిషోర్ కు కాలుకి గాయం అవడంతో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మురళీ కృష్ణంరాజు, సీతారామరాజు వారిని పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరావు,పోకనాటి వెంకటేశ్వరరావు,సిద్ధ అప్పలరాజు, దొడ్డిపట్ల కృష్ణ, జువ్వల దొరబాబు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

కత్తిపూడిలో వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు



- కాంగ్రెస్‌కు రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిన శంకవరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిద్ధాంత యేసు రత్నం...

శంఖవరం పెన్ పవర్ నవంబర్ 02:- కాకినాడ జిల్లా కత్తిపూడి గ్రామంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గాబు కృష్ణ, గౌతు స్వామి, అడపా సోమేష్ ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నూతనంగా చేరిన వారికి స్వాగతం పలికారు.ఈ చేరికల్లో భాగంగా శంఖవరం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న సిద్ధాంత యేసు రత్నం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతో పాటు పలువురు కుటుంబాలు కూడా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీకి మరింత బలం చేకూర్చేందుకు కార్యకర్త లందరూ సమష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గాబు గంగ ఆకుల నల్ల బాబు పేయ్యల కృష్ణ, దడాల బాలసుబ్రమణ్యం, పేయ్యల రాజా, కుసుమంచి సూరి, ప్రకాశరావు, మాదేపల్లి మహేష్, జీలకర కృష్ణ, మడికి ప్రకాష్, దడాల నాగేశ్వర రావు, బడే దేవుడు, కాపరూప్ సత్యనారాయణ, వాసా ప్రసన్న కుమార్, నమ్మి తాతారావు, తోటాడి సున్ని తదితరులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లంఊటను 20 లీటర్లగుడంబాను



- స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వి.ఆర్.పురం ఎస్.ఐ.సాధిక్.పోలీసుసిబ్బంది.

వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్.2 మండలంలోని చొక్కనపల్లి గ్రామానికిదగ్గరలో ఉన్న అటవీప్రాంతంలో(సారా)బట్టీద్వారా గుడంబాను తయారుచేసి అమ్ముతున్నారని,సమాచారం రావడంతో హుటాహుటీన ,వి.ఆర్.పురం ఎస్.ఐ.సాధిక్, పోలీసు సిబ్బంది.తో(సారా)బట్టీ స్థలానికి చేరుకొని,బట్టీని రైడ్ చేసి,ఆప్రదేశంలోఉన్న 400 లీటర్ల బెల్లంఊటను 20 లీటర్ల గుడంబా(సారా)ను స్వాధీనం చేసుకున్నారు. గుడంబానుత యారుచేయడం చట్టరీత్యానేరం ఎవరైసరే తయారుచేసి అమ్మినవారిపై చట్టపరమైన కేసులు నవటరీదుచేయడం జరుగుతుందని, వి.ఆర్.పురం ఎస్.ఐ.సాధిక్,ఒకప్రకటనలో మీడియాకుతెలిపారు.

స్థానిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి..

-పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పరిశీలించిన పెద్దాపురం ఆర్డీఓ కృష్ణమూర్తి



కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,నవంబర్ 2: మండల కేంద్రమైన ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ను పెద్దాపురం ఆర్టీవో కృష్ణమూర్తి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 5 వ తేదీన జరిగే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 61 ఓట్లు పోలవ్వగా , వాటిలో మహిళా ఉద్యోగులు, 24 మంది పురుషులు 37 మంది పోస్టల్ బ్యాలెట్ ను ఉపయోగించుకున్నారు. వారితో పాటు సర్వీస్ ఓటర్లు మరో 17 మందికి పోస్టల్ బ్యాలెట్ ను పోస్టు ద్వారా పంపించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

జగన్నాథగిరి ఎంపీటీసీ సమరంలో సత్తిబాబు సైకిల్ స్పీడు!



- టీడీపీ అభ్యర్థి వనుం సత్యనారాయణ ప్రచారంలో జోరు
- మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రచారంతో మరింత ఆసక్తికరంగా మారనున్న పోరు

కాజులూరు, పెన్‌పవర్, నవంబర్ 2:కాజులూరు మండల రాజకీయాల్లో జగన్నాథగిరి ఎంపీటీసీ ఎన్నిక ప్రత్యేక ఆకర్షణగా మారింది. తెలుగుదేశం పార్టీ తరఫున వనుం సత్యనారాయణ (సత్తిబాబు) అనూహ్యంగా బరిలోకి దిగడంతో మండల రాజకీయాల్లో ఒక్కసారిగా చర్చ మొదలైంది. టికెట్ కేటాయింపులో కొంత జాప్యం జరిగినప్పటికీ, పార్టీ అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఆయన ప్రచార రంగంలోకి దిగి సైకిల్ గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ప్రత్యర్థులకు దీటుగా తన ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.ఎంపీటీసీ అభ్యర్థిగా సత్తిబాబు పేరు ఖరారు కాకముందు నుంచే ఆయనకు ఎంపీపీ పదవి దక్కుతుందనే ప్రచారం టీడీపీ వర్గాల్లో జోరుగా సాగింది. అయితే ముందుగా జగన్నాథగిరి ఎంపీటీసీ స్థానంలో పోటీ చేయాలని, మిగిలిన రాజకీయ అంశాలను ఎన్నికల అనంతరం పరిశీలిస్తామని కూటమి నాయకులు భరోసా ఇచ్చినట్లు సమాచారం. దీంతో పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో సత్తిబాబు గ్రామంలో ప్రచారాన్ని వేగవంతం చేశారు.స్థానికంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ, చెరువుల అభివృద్ధి పనులతో పాటు రొయ్యల మేత విక్రయ రంగంలోనూ గుర్తింపు పొందిన వ్యక్తిగా సత్తిబాబుకు పరిచయాలు ఉన్నాయని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. గ్రామ ప్రజలతో ఉన్న సాన్నిహిత్యం, స్థానిక సమస్యలపై అవగాహన తనకు అనుకూలంగా మారుతాయని ఆయన వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.జగన్నాథగిరిలో కూటమి పార్టీలకు చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండటంతో ఎన్నికల సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. గాజు గ్లాసు, ఫ్యాన్ గుర్తుల అభ్యర్థులతో పోటీ నెలకొన్నప్పటికీ సత్తిబాబు సైకిల్ గుర్తుతో తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జగన్నాథగిరి గ్రామంలో తన తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు సత్తిబాబు వెల్లడించారు. మంత్రి ప్రచారానికి రానుండటంతో టీడీపీ, జనసేన శ్రేణుల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది. పార్టీ సీనియర్ నాయకుల మద్దతుతో ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని సత్తిబాబు భావిస్తున్నారు.

మొత్తంగా జగన్నాథగిరి ఎంపీటీసీ స్థానం కాజులూరు మండల రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. తక్కువ సమయంలోనే ప్రచారాన్ని వేగవంతం చేసిన వనుం సత్యనారాయణ ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటర్ల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుందన్నది స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

బంధనపూడి ఎంపీటీసీ బరిలో స్వతంత్ర అభ్యర్థిని మోకన శిరీష

పవనన్న స్ఫూర్తితో పోరాటం.. జనసేన మద్దతుదారుల అండతో ఏసీ గుర్తుపై ప్రచారం





కాజులూరు, పెన్‌పవర్, నవంబర్ 2:కాజులూరు మండలం బంధనపూడి ఎంపీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిని మోకన శిరీష ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. కూటమి పార్టీల మధ్య పొత్తుల సమీకరణాలు కుదరక జనసేన పార్టీ టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగారు. పార్టీ టికెట్ రాకపోయినా వెనక్కి తగ్గకుండా, పవన్ కళ్యాణ్ ఆశయాల స్ఫూర్తితో తనకు కేటాయించిన ఏసీ (ఎయిర్ కండిషనర్) గుర్తుపై ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో బంధనపూడి గ్రామంలో శిరీష పోటీపై ఆసక్తికర చర్చ సాగుతోంది.

రిజర్వేషన్లు ఖరారైన అనంతరం కూటమి పొత్తులో భాగంగా జనసేన తరఫున బంధనపూడి ఎంపీటీసీ టికెట్ తనకు లభిస్తుందని శిరీష ఆశించారు. అయితే చివరి నిమిషంలో టీడీపీ అభ్యర్థికి టికెట్ కేటాయించడంతో ఆమెకు అవకాశం దక్కలేదు. దీంతో స్థానిక జనసేన కార్యకర్తలు, మద్దతుదారుల ప్రోత్సాహంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. నామినేషన్ల చివరి రోజు సాయంత్రం 4.50 గంటలకు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేయకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరిగినప్పటికీ పట్టుదలతో తన నామినేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.నామినేషన్ అనంతరం కొద్దిరోజులు ప్రచారానికి దూరంగా ఉన్న శిరీష, తాజాగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని మహిళలు, పరిచయస్తులను కలుస్తూ తనకు జరిగిన రాజకీయ పరిణామాలను వివరిస్తున్నారు. జనసేన పార్టీ తరఫున పోటీ చేయాలన్న తన ఆకాంక్షకు టికెట్ రూపంలో అవకాశం దక్కకపోయినా, ప్రజల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోరాటం కొనసాగిస్తానని చెబుతున్నారు.

పవనన్న స్ఫూర్తే నా బలం..

పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీ అంటే తనకు ఎంతో అభిమానమని, ఆ పార్టీ గుర్తుపైనే పోటీ చేయాలని ఆశించానని శిరీష పేర్కొన్నారు. అయితే తనకు ఏసీ గుర్తు కేటాయించడంతో అదే గుర్తుపై ప్రజల్లోకి వెళ్తున్నానని తెలిపారు. జనసేన కండువా ధరించి, తన ఎన్నికల గుర్తును చూపిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. పార్టీ టికెట్ దక్కకపోయినా జనసేన యువ కార్యకర్తలు తనకు అండగా నిలుస్తామని భరోసా ఇవ్వడం మరింత ధైర్యాన్ని ఇచ్చిందని ఆమె వెల్లడించారు.బంధనపూడిలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిగా తనకు స్థానికంగా మద్దతు లభిస్తోందని శిరీష ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మహిళలతో పాటు వివిధ వర్గాల ఓటర్లను కలుస్తూ ఏసీ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. గ్రామంలో గణనీయంగా ఉన్న కాపు సామాజిక వర్గ ఓటర్లలోనూ తనకు మద్దతు లభిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు జనసేన జడ్పీటీసీ అభ్యర్థిని కూటి శేషారత్నం, టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థితో కలిసి ప్రచారం నిర్వహించనున్నారనే సమాచారం నేపథ్యంలో శిరీష కూడా తన ప్రచారాన్ని వేగవంతం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నప్పటికీ జనసేన అభిమానులు, కార్యకర్తల మద్దతు తనకు ఉందని ఆమె చెబుతున్నారు.టికెట్ దక్కకపోవడంతో మొదలైన రాజకీయ పరిణామాలు ఇప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా ఆమె ఎన్నికల పోరాటానికి దారితీశాయి. బంధనపూడిలో ఏసీ గుర్తుతో మోకన శిరీష సాగిస్తున్న ప్రచారం స్థానిక ఎన్నికల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. చివరకు ఓటర్లు ఎవరికి పట్టం కడతారన్నది ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

గోమాతపై ఘాతుకం.. నిందితులను శిక్షించాలి

ఆర్ఎస్ఎస్, హిందూ పరిషత్ సభ్యుల ఆందోళన.. న్యాయం చేయాలని వాడపల్లి గ్రామస్తుల డిమాండ్



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 2 గోమాతపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అత్యాచారం, హత్య ఘటన వాడపల్లి గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. మూగజీవిపై ఇలాంటి అమానుష చర్యకు పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు, హిందూ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామానికి చెందిన గంధం కేశవరావు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోమాతపై ముగ్గురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడి, అనంతరం హత్య చేసినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన ముగ్గురు నిందితులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ ఘటన వెలుగులోకి రావడంతో గ్రామంలో తీవ్ర ఆవేదన, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మాట్లాడలేని మూగజీవిపై ఇలాంటి దారుణానికి పాల్పడటం అమానవీయమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోమాతకు జరిగిన అన్యాయంపై న్యాయం జరిగే వరకు తమ నిరసన కొనసాగిస్తామని హిందూ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్, హిందూ పరిషత్ సభ్యులు ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఇందు చైతన్య వేదిక కూడా సమిష్టిగా స్పందించి, ఘటనపై న్యాయపరమైన పోరాటానికి సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.పోలీసులు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వాడపల్లి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నగరపాలక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి



కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 2:నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను సమర్థ వంతంగా చేపట్టేందుకు యంత్రాంగం అన్ని విధాలా సంసిద్ధంగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్ లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు, అధికారుల విధులు, బాధ్యతలు, ఎన్నికల నియమావళిపై అన్ని విభాగాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎన్నికల విధులకు నియమితులైన ప్రతి అధికారి, ఉద్యోగి ఎన్నికల నియమ నిబంధనలు, విధివి ధానాలు, తమకు కేటాయించిన బాధ్య తలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పొరపాట్లు, లోపాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా, సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల ముందస్తు ప్రణాళికలో భాగంగా ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో నియమితులైన అధికారులు అవసర మైన ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి పూర్తి చేయాలని ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులకు ఇబ్బందులు కలగకుండా చెక్‌లిస్టుల ఆధారంగా ఎన్నికల సామాగ్రిని సక్రమంగా అందజే యాలని ఆదేశించారు.రూట్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలకు రోడ్ మ్యాప్‌లను ముందుగానే పరిశీలించి, రవాణా మార్గాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ సూచించారు. ఎన్నికల సిబ్బంది, సామాగ్రి రవాణాలో అంత రాయాలు తలెత్త కుండా అవసరమైన బస్సులు, మినీ బస్సులు, ఇతర వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సంబంధిత రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే మొత్తం 494 పోలింగ్ కేంద్రాల్లో అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్), సమస్యాత్మక (సెన్సిటివ్), క్రిటికల్, సాధారణ పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని తెలిపారు. ఆయా కేంద్రాల్లో పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సంబంధించి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్ల దాఖలు, ఎన్నికల గుర్తుల కేటాయింపు, అవసరమైన అనుమతులు, ఎన్నికల ప్రచార వ్యయ నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. కావున ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, ఉద్యోగులు తమకు కేటాయించిన బాధ్యతలను ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తి నిబద్ధతతో నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, ఈఈలు మదర్సా అలీ, మాధవి, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ అబ్దుల్ మలిక్, అకౌంటెంట్ రామసత్యం పాల్గొన్నారు.

పెంటపాడు లో జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో వడ్డీ రఘురామ్ విస్తృతంగా ప్రచారం



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 02.తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం పెంటపాడు గ్రామంలో ఎంపీటీసీ అభ్యర్థులు తరఫున ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు పెంటపాడు గ్రామంలో నవంబర్ 5వ తేదీన జరగనున్న జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వడ్డీ రఘురామ్ నాయుడు గారు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన జడ్పీటీసీ అభ్యర్థి శ్రీ నల్లమిల్లి విజయ్ ఆనంద్ రెడ్డి కి ఎంపీటీసీ అభ్యర్థి (1) కర్రీ పృథ్వి కుమార్ రెడ్డి ని ఎంపీటీసీ అభ్యర్థి (2) కర్రీ ప్రియాంక ని ఎంపీటీసీ అభ్యర్థి (3) బర్ల జయ బాబు ని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక ప్రజలను అభ్యర్థించారు.?వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనను చూసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మురుసు తుఫాన్ నేపథ్యంలో కమిషనర్ వార్డుల డ్రైన్ బ్లాకుల తొలగింపు పరిశీలన.



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 02.మురుసు తుఫాన్ ప్రభావంతో ఈరోజు మున్సిపల్ కమిషనర్ ఎమ్. యేసుబాబు పట్టణంలోని పలు వార్డులను క్లుప్తంగా సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను, డ్రైన్ల క్లియరింగ్ పనులను స్వయంగా వెరిఫై చేసి ఇన్స్ట్రక్ట్ చేశారు. తుఫాన్ కారణంగా ఏర్పడిన డ్రైన్ బ్లాకులను తొలగించి, నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.పారిశుధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని, అన్ని వార్డులలో డ్రైన్లు పూర్తిగా క్లియర్ చేసి ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు..

స్థానిక ఎన్నికల్లో టీడీపీ తీరుపై మాజీ ఎంపీ మార్గాని ఆగ్రహం

ఇవిఎం ఎమ్మెల్యేకు రిజర్వేషన్లు ముందుగా ఎలా తెలిసాయి?



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 2:కడప జిల్లా పులివెందుల స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తీరు దారుణంగా ఉందని, మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వివిఎల్ పురం లో మార్గాని ఎస్టేట్స్‌లో వైసిపి సిటీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మార్గాని భరత్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై పిడి గుద్దులు కురిపించారని ధ్వజమెత్తారు. ఇన్నీ అక్రమాలు జరుగుతున్నా ఎస్ఇసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రాప్తాడులో పదో తరగతి బాలిక ఉన్మాద ఘటన జరిగినా జాతీయ మీడియాలో రాకపోవటం దారుణమన్నారు. ఈ ఘటనలో నిందితుడి పై కాల్పులు జరిపి ఎన్‌కౌంటర్ చేయడానికి యత్నించారన్నారు. అయితే డాక్టర్ ప్రియాంకను నగరంలో దారుణంగా కారుతో తలపై ఎక్కించి చంపేస్తే 10 రోజుల వరకు ఘటనను బయటకు రానివ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని, దాంతో నిందితులను కాపాడే యత్నం చేసారని ఆరోపించారు. ఈ కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసు కోలేదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నదే లక్ష్యమని వెల్లడించారు. సుగాలి ప్రీతి కేసులో తీవ్రంగా స్పందించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆ కేసులో నిందితులపై ఈ తరహా చర్యలు ఎందుకు తీసుకొలేదో చెప్పాలని డిమాండ్ చేసారు. మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల రిజర్వేషన్ వివరాలు స్థానిక ఎమ్మెల్యేకి ముందుగానే ఎలా తెలిసియన్నారు. రిజర్వేషన్లు మున్సిపల్ కమిషనర్ చేశారా స్థానిక ఎమ్మెల్యే చేశారా చెప్పాలని డిమాండ్ చేసారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు పారదర్శకం గా జరుగుతాయని నమ్మకం లేదని ఎన్నికల కమీషన్ ఆలోచన చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి నుంచి 72 డివిజన్ల లో అభ్యర్థులను నిలబెడ తామన్నారు. సిఈసీ జ్ఞానేశ్వర్ ను తొలగించాలని, ఇంత జరుగుతున్నా సిఈసి రాజీనామా చేయక పోవడం దారుణ మన్నారు. కేంద్ర ప్రభుత్వం సిఈసీ ని వెనుకవేసుకుని రావాల్సిన అవసరం లేదన్నారు. అన్యా యంగా, కుట్ర పూరి తంగా ఓట్లను తొలగిస్తుంటే ప్రజాస్వామ్యానికి విలువ లేదన్నారు.

ఎన్నికల విధులపై మైక్రో అబ్జర్వర్లకు పూర్తి అవగాహన ఉండాలి





- పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 2: పోలవరం జిల్లాలో నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధులపై మైక్రో అబ్జర్వర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

సోమవారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో రెండవ సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు--2026 నిర్వహణలో భాగంగా మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొని ఎన్నికల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమని, మైక్రో అబ్జర్వర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ముందుగానే ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా సిద్ధం చేయాలని, పోలింగ్ సిబ్బందిని యాదృచ్ఛిక పద్ధతిలో ఎంపిక చేసి శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థుల తరపున నియమితులైన పోలింగ్ ఏజెంట్లు నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రంలో కూర్చొని ప్రక్రియను పరిశీలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి ఎదుట బ్యాలెట్ బాక్సును ఏర్పాటు చేయాలని, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికకు గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తారని వివరించారు. ఈ రెండు రకాల బ్యాలెట్ పత్రాలను ఒకే బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రం వెలుపల ఓటర్లకు అవసరమైన సమాచారం, ఓటర్ల క్రమ సంఖ్య తదితర వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు.జిల్లాలోని 12 మండలాల్లో 12 జెడ్పీటీసీ స్థానాలతో పాటు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ రోజున ఒక్కో అభ్యర్థి తరపున ఒక్క పోలింగ్ ఏజెంట్‌ను మాత్రమే కేంద్రంలోకి అనుమతించాలని స్పష్టం చేశారు. ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.గిరిజన ప్రాంతమైన పోలవరం జిల్లాలో స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రతి అధికారి బాధ్యత అని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా, సమన్వయంతో తమ విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కరరావు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రాంప్రసాద్, ఎల్‌డీఎం ప్రదీప్, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్యంపై విస్తృత అవగాహన కల్పించాలి


- ఓటరు అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్ కుమార్



రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 2: పోలవరం జిల్లాలో ఓటరు చైతన్యంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రెండో విడత సాధారణ ఎన్నికలు--2026లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో రూపొందించిన ఓటరు అవగాహన పోస్టర్లను కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కు విలువను తెలుసుకొని ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరారు. ఓటరు సమాచారాన్ని తెలుసుకునేందుకు పోస్టర్లలో పొందుపరిచిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అవసరమైన వివరాలను పొందవచ్చని తెలిపారు.ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించేందుకు అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కరరావు, డ్వామా పీడీ బి. రాంప్రసాద్, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి మందుగుండు దుకాణాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

భద్రతా నిబంధనలు పాటించాలి -- సబ్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్



రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 2: దీపావళి పండుగ సందర్భంగా మందుగుండు సామగ్రి విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు రెవెన్యూ శాఖ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్ ఆదేశించారు.ఈ నెల 8వ తేదీన దీపావళి పండుగ నేపథ్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మందుగుండు సామగ్రి విక్రయించాలనుకునే వ్యాపారులు సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని సూచించారు. దుకాణాలను గ్రామాలకు దూరంగా, జనావాసాలు లేని ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు.ప్రమాదాల నివారణకు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, విక్రయ కేంద్రాల వద్ద అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. విక్రయదారులు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో తహసీల్దార్లు సీహెచ్ బాలాజీ, కరక సత్యనారాయణ, అమ్మాజీ, సీహెచ్ శ్రీనివాసరావు, తేజస్విని, స్వామి, శ్రీరాములు, సబ్ కలెక్టర్ పరిపాలన అధికారి ఏ. సత్యనారాయణ, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆర్థిక సహాయం



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 02. తాడేపల్లిగూడెం నియోజకవర్గం, పెంటపాడు మండలం, బోడపాడు గ్రామానికి చెందిన పాల రాంబాబు తుపాను ప్రభావంతో సంభవించిన పిడుగుపాటుకు గురై మృతి చెందడం తీవ్ర విచారకరం.ఈ విషాదకర ఘటన గురించి తెలుసుకున్న తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఉ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ కింజరపు ఎర్రం నాయుడు 14వ వర్ధంతి వేడుకలు.



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 02. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్.. గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో వారి కార్యాలయం నందు..మాజీ కేంద్ర మంత్రివర్యులు స్వర్గీయ కింజరపు ఎర్రం నాయుడు 14వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు గొర్రెల శ్రీధర్ గారి యువసేన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ ముందుగా ఎర్రం నాయుడు గారి చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలతో ఘనంగా నివాళులర్పించారు... ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కింజరపు ఎర్రం నాయుడు మన నుండి దూరం అయ్యి 14 సంవత్సరాల అయిందంటే నమ్మశక్యంగా లేదు... ఆయన ఇప్పటికీ మన మధ్య ఉన్నట్లుగా అనిపిస్తుంది.. ఆయన అడుగుజాడల్లో ముందుకు నడుస్తూ, ఆయన ఆశయాలను ప్రజలలోకి తీసుకుని వెళ్లి వారి కుటుంబ సభ్యులైనటువంటి రామ్మోహన్ నాయుడు, అచ్చం నాయుడు, ఆదిరెడ్డి భవాని ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారు అదే స్ఫూర్తితో నేను కూడా ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం ఉన్న ముందుండి తీరుస్తానని... ఎర్రం నాయుడు జ్ఞాపకాలతో ఆయన ఆశయాలను ప్రజలలోకి తీసుకువెళ్లి ముందుకు నడుస్తానని తెలియజేస్తూ ఆ మహానుభావుడికి మరొక్కసారి నివాళులర్పిస్తున్నానని తెలియజేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా భద్రతా చర్యలు పటిష్టం చేయాలి పోలవరం డీఎస్పీ శ్రీ యు రవి చంద్ర



కుక్కునూర్ పెన్ పవర్ నవంబర్ 02 :ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారి యొక్క ఆదేశాలపై రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలవరం డీఎస్పీ కుక్కునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నితమైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సున్నితమైన ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షిస్తూ, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.అనంతరం సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్లతో సమావేశమైన డీఎస్పీ ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సున్నితమైన పోలింగ్ కేంద్రాల నిర్వహణపై చర్చించారు.అవసరమైన ప్రాంతాల్లో తగిన సంఖ్యలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు వీడియోగ్రఫీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.ఎన్నికల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి అంశంలో అప్రమత్తత పాటించాలని పేర్కొన్నారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ తరఫున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రజాస్వామ్య పండుగైన ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోంది.

స్థానిక ఎన్నికలకు 600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

- స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘా.. భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ చక్రవర్తిలి



రంపచోడవరం, (పోలవరం బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 2: పోలవరం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సుమారు 600 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల ప్రచార గడువు నవంబర్ 3వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని, అనంతరం ఎలాంటి బహిరంగ ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, సభలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

12 మండలాల్లో ముందస్తు భద్రతా చర్యలు

జిల్లాలోని 12 మండలాల్లో రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులు, అనుమానితులను సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో బైండోవర్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రతి మండలంలో పోలీసు బలగాలకు ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు వెపన్ పార్టీలు, క్విక్ రియాక్షన్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రహదారులపై నిరంతర నిఘా ఉంచుతూ, అవసరమైన ప్రాంతాల్లో తక్షణమే పోలీసు బలగాలను మోహరించేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

స్థానిక ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పెట్టెల భద్రత కోసం రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను ఎస్పీ కె. చక్రవర్తి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలను తనిఖీ చేశారు.

స్ట్రాంగ్ రూముల వద్ద విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, బ్యాలెట్ పెట్టెలకు పూర్తి భద్రత కల్పించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ మందా జావలి ఆల్ఫోన్సా, డీఎస్పీ అష్రఫ్ అలీ, ఎస్పీ సీఐ భాను ప్రసాద్, సీఐ గోపి నరేంద్ర ప్రసాద్, ఎస్సై రమేష్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ం

ఈనెల 10 కల్లా పీవీ ఎన్ పార్కును వినియోగం లోకి తేవాలి-కమిషనర్ రాహుల్ మీనా



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 2:పీవీ నరసింహరావు పార్కు అభివృద్ధి పనులను వేగవంతం చేసి ఈనెల 10 వ తేదీ కల్లా అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. గోదావరి రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను సోమవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెయిలింగ్ పెయింటింగ్ కు సంబంధించి పలు సూచనలు చేశారు. పనుల నాణ్యత లో ఎలాంటి రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఈఈ మదర్సా అలీ, ఏఈ రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com